ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం అక్టోబరు 6, 2024 13

సంతోషాన్ని పంచిన సంతానలక్ష్మి అమ్మవారు



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో దసర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శనివారం అమ్మవారు సంతానలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. తల్లీచల్లంగా చూడు అంటూ భక్తులు వేడుకున్నారు. లక్ష్మీతాయారు అమ్మ ఆలయంలో ఈ అలంకారాన్ని వీక్షించిన భక్తులు మురిసిపోయారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. అర్చకులు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. 'సకల చరాచర జగత్తు అంతా ఆ అమ్మ సంతానమే. అందుకే ఈ అమ్మకు సంతానలక్ష్మి అని పేరు. ఈ రూపంలో అమ్మను ఆరాధిస్తే సుఖశాంతులు కలుగుతాయని' వైదిక పెద్దలు ప్రవచించారు. ఈ అమ్మను పూజిస్తే సంతానానికి సంబంధించిన అవరోధాలన్నీ తొలగి సత్సంతానం కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. చిత్రకూట మండపంలో సామూహిక రామాయణ పారాయణం సాగింది. గజలక్ష్మి రూపంలో అమ్మవారు ఆదివారందర్శనమిస్తారని స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకులు విజయరాఘవన్ తెలిపారు.



కుంకుమార్చన చేస్తున్న మహిళలు



ప్రముఖ నటి కీర్తి సురేష్.. ఖమ్మం నగరంలో శనివారం సందడి చేశారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు.

ఖమ్మంలో మహా నటి

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పాల్వంచ పెద్దమ్మతల్లి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆకుపూజ, చండీ హోమం, లక్ష కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎన్.రజనీకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా చేపట్టనున్న అన్నదానం కార్యక్రమానికి ఏపీలోని రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన భక్తులు వై.రామారావు దంపతులు రూ.1,01,116ను విరాళమిచ్చారు. వారికి అర్చకులు ఆశీర్వచనంతో పాటు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాన్ని అందజేశారు.

'డీఎస్సీ' అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

కొత్తగూడెం విద్యావిభాగం: కొత్తగూడెం సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 447 పోస్టులకు సంబంధించి 1:3 నిష్పత్తిలో 1,051 మంది అభ్యర్థులను అధికారులు ఆహ్వానించగా 971 మంది హాజరైనట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి వెల్లడించారు. ఏఎంఓ నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి మగువా లక్ష్మీస్వరూపమే!



ఆదివారం ప్రత్యేకం

భద్రాచలం, న్యూస్‌టుడే

విజయదశమి సందర్భంగా దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. భద్రాచలం రామాలయంలో అష్టలక్ష్ముల అలంకారాలు ఆధ్యాత్మికతను చాటుతున్నాయి. ప్రతి మగువా లక్ష్మీస్వరూపమే. ఇలాంటి స్ఫూర్తి రగిలించే అంశాలు దసరా ఉత్సవాల్లో ఇమిడి ఉన్నాయి.

వృత్తిని దైవంగా భావించాలి

రమాదేవి, రామాలయం ఈఓ



వృత్తిని భగవంతుడి స్వరూపంగా భావించటమే లక్ష్మీ తత్వం. ఉద్యోగం ద్వారా లభించే గుర్తింపు భావితరాలకు ఆదర్శమవ్వాలి. చేసేపనిలో పారదర్శకత ఉండాలి. ప్రస్తుత సమాజంలో ప్రతి మగువా తమతమ రంగాల్లో దూసుకెళ్లాలి. అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉంటే అదే శ్రీరామ రక్షగా మారుతుంది.

భక్తితో కటాక్షం



కంచెర్ల నాగలక్ష్మి, భక్త రామదాసు వంశంలో పదోతరం కోడలు

గజలక్ష్మిని ఆరాధించి దేవేంద్రుడు మూడు లోకాలపై ఆధిపత్యం ప్రదర్శించాడు. దేవతలంతా ఒక్కటై వచ్చి దీవెనలందించాలంటే భక్తికి మించిన సాధనముండదు. భక్తిని మహాసంపదగా భావిస్తే గజలక్ష్మి కటాక్షం కలిగినట్లే. చిన్నచిన్న విషయాలకు ఆందోళనకు గురవకుండా ప్రశాంతంగా ఆలోచించే శక్తిని పొందవచ్చు.

సత్సంతానంతో సమాజ వికాసం

డా.శ్రీనిధి, గైనకాలజిస్ట్, భద్రాచలం



జీవితంలో నిలదొక్కుకోలేదని కొందరు వివాహాలను ఆలస్యం చేస్తున్నారు. ఇంకొంతమంది అవగాహన లేక చిన్న వయస్సులోనే పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. ఈవిషయంలో చట్టాలను గౌరవించటంతో పాటు శాస్త్రీయంగానూ ఆలోచించాలి. గతంతో పోల్చితే ఆడపిల్లలపై వివక్ష తగ్గింది. పిల్లలు ప్రయోజకులుగా ఎదగటానికి మార్గం ఏర్పర్చగలిగితే అదే సత్సంతానమవుతుంది. సమాజ వికాసానికి దోహదపడుతుంది.

ధాన్యమే లక్ష్మి

కొమరం బుచ్చమ్మ, గిరిజన రైతు, భద్రాచలం



సకాలంలో వానలు కురిస్తేనే దేశం సస్యశ్యామలంగా మారుతుంది. మాకుటుంబమంతా ఐదెకరాల్లో పంటలు పండిస్తున్నాం. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇంటికి చేరినప్పుడు కలిగే ఆనందమే వేరు. ధాన్యమే లక్ష్మి అని సంపూర్ణంగా విశ్వసిస్తా. శ్రమను నమ్ముకుంటే విజయం సాధించవచ్చు.

అవాంతరాలు ఎదురైనా ఆగిపోవద్దు..

విజయలక్ష్మి, ఎస్సై, భద్రాచలం



మాదకద్రవ్యాలతో యువత పెడదోవ పట్టే ప్రమాదముంది. మత్తు పదార్థాల జోలికి వెళ్తే జీవితాలు ఛిద్రమవుతాయి. చెడు వ్యసనాలను తొలినాళ్లలోనే గుర్తించి మానేయాలి. తల్లిదండ్రుల ఆకాంక్షలను గౌరవిస్తూనే సొంత లక్ష్యాల సాధనకు పట్టుదలతో ముందుకు కదలాలి. ఎలాంటి అవాంతరాలు ఎదురైనా ధైర్యంగా పోరాడితే ప్రతి యువతీ వీరలక్ష్మిగా నిలుస్తుంది. ధైర్యే సాహసే లక్ష్మి.

చదువే ఐశ్వర్యం

తోటమళ్ల రమ, ఇన్‌ఛార్జి ఎంఈఓ, భద్రాచలం



ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తిసామర్థ్యాలు అని అర్థం. సమాజ హితం కోరే మాటలకు పదునెక్కువ. అది చదువుతోనే సాధ్యం. చదువు అబ్బితే అదే అనంత ఐశ్వర్యం. ఎప్పటికీ మన నుంచి దూరమవని ఆస్తి చదువే.

కీర్తి.. నిజమైన ధనం

సరోజమ్మ, అనాథాశ్రమ నిర్వాహకురాలు, భద్రాచలం



ఏది సాధించాలన్నా ధనమే మూలమని నమ్ముతుంటారు. ధనం అంటే కేవలం డబ్బులు మాత్రమే కాదు. మనం సాధించిన కీర్తి కూడా ధనలక్ష్మి స్వరూపమే. ఇందుకు లాభాపేక్ష లేని త్రికరణ శుద్ధి అవసరం. పరోపకారం, దయ అనే గుణాలను విస్తరిస్తే శక్తిస్వరూపంగా మారవచ్చు. ఆకలితో ఉన్నవారికి కడుపు నిండా అన్నం పెట్టినప్పుడే ధనం ఉద్దేశం నెరవేరుతుంది.

ప్రయత్న లోపం ఉండొద్దు..

హారిక అంతర్జాతీయ కర్రసాము క్రీడాకారిణి



ఏ రంగంలోనైనా నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక అవసరం. సమయపాలన ఉండాలి. నిపుణుల సలహాలు పాటిస్తూ సందర్భోచితంగా వ్యవహరించాలి. ప్రయత్న లోపం ఉంటే పోటీ ప్రపంచంలో వెనుకబడినట్టే. విజయం సాధించినా గర్వం తగదు. విజయాన్ని లక్ష్మీరూపంగా గౌరవిస్తేనే మంచిది.

అమ్మే.. తొలి గురువు

తరుణి, న్యాయవాది, భద్రాచలం



మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించటానికి వివిధ రూపాలను ధరించిన అమ్మవారు కరుణాస్వరూపమైన తన నిజరూపంలో అందరినీ అనుగ్రహిస్తుంది. ఈరూపమే మహాలక్ష్మి. ప్రతి ఇంట్లో ఉండే అమ్మనే మహాలక్ష్మి. అమ్మే మనకు తొలి గురువు. అమ్మమాట జవదాటని వారందరూ విజేతలే. మాతృదేవో భవ..!

చదువుతో పాటు క్రీడల్లో రాణించటం ముఖ్యం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం పట్టణం ప్రకాశం మైదానం, పాల్వంచ నవభారత్ విద్యాలయంలో జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో రాణించే వారు జీవితంలో ఆటుపోట్లను తట్టుకునే శక్తిని కలిగి ఉంటారన్నారు. తొలిరోజు పలు జిల్లాల జట్లు తలపడ్డాయి. జిల్లా సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, యుగంధర్, జనక్‌సింగ్, విద్యాసాగర్, కవిత, స్టెల్లా, సుజాత, సీతాదేవి, రాములమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లీగ్ మ్యాచ్‌ల సందడి.. తొలిరోజు లీగ్ మ్యాచ్‌లు సందడిగా జరిగాయి. నిజామాబాద్-2 జట్టు మహబూబ్‌నగర్‌పై ఒక గోల్ తేడాతో, మరో మ్యాచ్‌లో నిజామాబాద్‌పై నల్గొండ 3 గోల్స్‌తో తేడాతో, హైదరాబాద్‌పై వరంగల్ 3-1 స్కోర్‌తో, హైదరాబాద్‌కు చెందిన మరో జట్టుపై ఒక గోల్ తేడాతో రంగారెడ్డి, మెదక్‌పై వరంగల్ 0-3 స్కోర్‌తో విజయం సాధించాయి. ఖమ్మం-నల్గొండ, ఆదిలాబాద్-మహబూబాబాద్, కరీంనగర్-రంగారెడ్డిల మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. రేపటితో టోర్నీ ముగియనుంది.



ఫుట్‌బాల్ టోర్నీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, చిత్రంలో ఎమ్మెల్యే సాంబశివరావు, డీవైఎస్‌వో పరంధామరెడ్డి

పండగ నాటికి పదవులొచ్చేనా..?

ఈటీవీ, ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా 78 మార్కెట్లకు పాలకవర్గాలు కొలువుదీరినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మరో పది మార్కెట్ల పదవులు కొలిక్కిరావటం లేదు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఎంపిక ప్రక్రియ కొలిక్కిరాలేదు. దసరా నాటికైనా అన్ని మార్కెట్లకు పాలకవర్గాలను ప్రకటిస్తే.. తమకు పదవులొస్తాయని పలువురు ఆశిస్తున్నారు. ఇక రాబోయేది మార్కెట్ సీజన్ కావటంతో పాలకవర్గాలు కొలువుదీరాల్సిన అవసరం కనిపిస్తోంది.

ఆశావహుల పోటాపోటీ

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి, మద్దులపల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, దమ్మపేటలో మార్కెట్ యార్డులున్నాయి. నేలకొండపల్లి, మద్దులపల్లి, కల్లూరు, సత్తుపల్లి మార్కెట్లకు ఇటీవల పాలకవర్గాలు కొలువుదీరాయి. ఖమ్మం, మధిర, వైరా మార్కెట్ ఛైర్మన్ పదవులు బీసీ జనరల్, ఏన్కూరు ఛైర్మన్ పదవి ఎస్టీ కోయ, భద్రాద్రి జిల్లాలోని మార్కెట్ల ఛైర్మన్ పదవులన్నీ ఎస్టీలకు దక్కనున్నాయి. ఆయా మార్కెట్ కమిటీల ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఆశావహులు చాలాకాలంగా



ఎదురుచూస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు అవసరమవుతుండటంతో మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారికే పదవులు కట్టబెట్టాలని సీనియర్లు కోరుతుంటే.. 2023 శాసనసభ ఎన్నికలకు ముందు హస్తం గూటికి చేరిన నాయకులూ తమవంతు ప్రయత్నం చేస్తుండటంతో ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. కొత్తగూడెం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిపై మిత్రపక్షాలు కాంగ్రెస్, సీపీఐ కన్నేయటం గమనార్హం.

అన్నదాతలకు దన్నుగా

అనేకచోట్ల పాలకవర్గాలు కొలువుదీరకపోవటంతో పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డులకు వచ్చే అన్నదాతలకు ఇబ్బందులు తప్పటం లేదు. రైతులు, వ్యాపారుల మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తూనే కర్షకులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత మార్కెట్ పాలకవర్గాలపై ఉంటుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెలాఖరు నుంచే పత్తి రాక మొదలవుతుంది. ఆ తర్వాత మిరప వస్తుంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో విపణిలో క్రయ విక్రయాల పర్యవేక్షణకు పాలకవర్గం తప్పనిసరి. ఛైర్మన్ సహా పాలకవర్గం లేకపోతే.. ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు సాగుతాయన్న వాదన వినిపిస్తుంది. అదే జరిగితే కర్షకులకు గిట్టుబాటు ధర అందటం గగనంగానే మారుతుంది. అంతే కాకుండా ఖమ్మం మార్కెట్ ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ పనుల పర్యవేక్షణ సక్రమంగా సాగాలంటే పాలకవర్గం కొలువుదీరాల్సిన అవసరముంది. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గమైన ఖమ్మంలో మార్కెట్ ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది. అమాత్యుడి ఆశీస్సులు ఎవరికి ఉన్నప్పటికీ.. వీలైనంత త్వరగా పాలకమండలి కొలువుదీరితేనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దసరా పండగ నాటికైనా అన్ని మార్కెట్లకు పాలకవర్గాలను ప్రకటించాలని ఆశావహులు, రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పెరగాలి



డ్రోన్ల వినియోగంపై విద్యార్థులకు వివరిస్తున్న డ్రోన్స్ ఇన్‌ఛార్జి సాయికిరణ్

అశ్వారావుపేట: వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పెరగాల్సిన అవసరముందని వ్యవసాయ కళాశాల ఇన్‌ఛార్జి ఏడీ ఐవీ శ్రీనివాసరెడ్డి అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రోన్ల వినియోగం వల్ల పంటలకు పురుగు మందుల పిచికారీ సులువవుతుందన్నారు. భద్రాద్రి డ్రోన్స్ ఇన్‌ఛార్జి సాయికిరణ్, కళాశాల ఆచార్యులు గోపాలకృష్ణమూర్తి, రాంప్రసాద్, కె.శిరీష, రెడ్డిప్రియ, కృష్ణతేజ పాల్గొన్నారు.

ఎర్రమట్టిని కొల్లగొట్టి..!

ములకలపల్లి, న్యూస్‌టుడే

పాల్వంచ పరిసర ప్రాంతాల్లో ఎర్రమట్టి నిల్వలు నామమాత్రంగా ఉన్నాయి. లారీ ఎర్రమట్టి ధర రూ.30వేలకు పైగా పలుకుతుండటంతో అక్రమార్కుల కన్ను సీతారామ ప్రాజెక్టు వైపు పడింది. అటవీ, రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారుల సమన్వయ లోపంతో సరిహద్దు మాటున ఎర్రమట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ములకలపల్లి మండలంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ సమయంలో భారీస్థాయిలో ఎర్రమట్టి నిక్షేపాలు బయటపడ్డాయి. ఆ మట్టిని కాలువ బలంగా ఉండేందుకు ఇరువైపులా కొంతమేర చదును చేయగా, భవిష్యత్ అవసరాల కోసం మిగిలిన మట్టిని గుట్టలుగా నిల్వ చేశారు. దీనిని అవకాశంగా తీసుకున్న అక్రమార్కులు పాల్వంచ మండలం తోగ్గూడెం, దంతెలబోరు, బండ్రుగొండ మీదుగా ములకలపల్లి మండలం కొత్తూరు శివారు లోని సీతారామ మట్టి నిల్వలను తరలించేందుకు

నిఘా





సీతారామ కాలువ 47.1 కిమీ వద్ద ఎర్రమట్టిని తరలిస్తున్న ప్రదేశం

ఎర్రమట్టిని తరలిస్తున్న ప్రదేశానికి సమీపంలో సీతారామ కాలువ


వారం రోజుల క్రితం యత్నించారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు అడ్డుకునేందుకు అక్కడికి వచ్చారు. స్థానికులు వస్తున్నారని తెలుసుకున్న అక్రమార్కులు లారీలోని మట్టిని కాలువ సమీపంలో కొత్తూరు- బండ్రుగొండ రహదారి పక్కన పారబోసి జేసీబీతో సహా ఉడాయించారు.

రాత్రిపూట తరలింపు..: మూడు రోజులుగా మాధారం అటవీ ప్రాంతంలోని సీతారామ కాలువ 47.1 కి.మీ వద్ద జేసీబీ సహాయంతో మట్టిగుట్టలను తవ్వుతూ రాత్రిళ్లు లారీలతో తరలిస్తున్నారు. ఈప్రాంతం అటు రెవెన్యూ, అటవీశాఖ, ఇటు నీటిపారుదలశాఖ సరిహద్దుగా ఉండటంతో ఇక్కడి నుంచి సుమారు 100 లారీల ఎర్రమట్టిని సీతారామ కాలువ, పూసుగూడెం, ఆనందపురం మీదుగా పాల్వంచ పరిసర ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై స్థానికులు అధికారులకు సమాచారమిచ్చినా స్పందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు అదే లారీలతో ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి కాలువ సమీప ప్రాంతంలో పారబోస్తుండటం గమనార్హం.

- ఈ అంశంపై సీతారామ కాలువ డీఈ రాంబాబు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కాలువ నిర్మాణం పూర్తయ్యిందని, సిబ్బంది పర్యవేక్షణ తగ్గిందని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

భద్రాచలం పట్టణం, బూర్గంపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆరోగ్య సంచాలకుడు డా.బి.రవీందర్‌నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రాచలం ప్రాంతీయ వైద్యశాల, బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఔషధ నిల్వలను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. తరుణ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జాతీయ వైద్య కార్యక్రమాలు జనానికి చేరువయ్యేలా చూడాలన్నారు. జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్‌నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.బాలాజీ, భద్రాచలం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, సాయి కల్యాణ్, ఫయాజ్, డా.లక్ష్మీసాహితి తదితరులు పాల్గొన్నారు.



మోరంపల్లిబంజర పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్

రాములోరికి రత్నాంగి అలంకారం

భద్రాచలం, న్యూస్‌టుడే

70 వేల రత్నాలతో సిద్ధమవుతున్న వస్త్రం

భద్రాచలం రాములవారికి త్వరలోనే రత్నాంగి అలంకారం ఏర్పాటు చేయనున్నారు. దాతల సాయంతో ప్రముఖ స్థపతి దండపాణి దీన్ని కొద్ది నెలలుగా తయారు చేస్తున్నారు. సుమారు రూ.కోటి వరకు ఇందుకు వెచ్చించే వీలుంది. నాణ్యమైన రాగి రేకుపై రత్నాలను పొదిగి ఈ అలంకారాన్ని సిద్ధం చేస్తున్నారు. మొదట్లో 30 వేల రత్నాలను ఉపయోగించాలని భావించినప్పటికీ సీతారామ లక్ష్మణుల వారి ధ్రువమూర్తులకు పూర్తి స్థాయిలో వస్త్రాలను తయారు చేయాలంటే 70 వేల రత్నాలు అవసరం ఉంటుందని సమాచారం. ఇవి సుదీర్ఘ కాలం మన్నిక అయ్యేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చే నెలలో ఈ అలంకారం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. అది వీలుకాని పక్షంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల తరుణంలో రత్నాంగి అలంకార దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది.

☆ రాములవారికి నిత్యం ప్రత్యేక పూజలు సాగుతుండటంతో భక్తులకు కన్నుల పండగే.. సోమవారం ముత్యాల వస్త్రాల అలంకారంలో రామయ్య దర్శనం ఉంటుంది. శుక్రవారం స్వర్ణ కవచాల అలంకారం నిర్వహిస్తున్నారు. ఆదివారం అభిషేకం, శనివారం బంగారు తులసీ దళార్చన చేస్తున్నారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఏదో ఒక రోజున రత్నాంగి అలంకారం ఉండేలా వైదిక పెద్దలు నిర్ణయం తీసుకోనున్నారు. ఆలయ శిఖరాన్ని బంగారంతో తాపడం చేయించేందుకు గతంలో ఓ దాత ముందుకు వచ్చినా



ఆ తర్వాత ఇది కార్యరూపం దాల్చలేదు. ప్రధాన ఆలయంలో బంగారు, వెండి వాకిళ్లు ఉన్నాయి. మిగతా చోట్ల పెద్ద కోవెళ్లలో అంతరాలయం మొత్తం బంగారు, వెండి తాపడాలతో శోభను సంతరించుకుంటున్నందున ఇక్కడా దాతల సాయంతో మరింత వైభవాన్ని తీసుకురావాలని భక్తులు ఆశిస్తున్నారు. కల్యాణ మూర్తులకు 5 కిలోల శోభా కవచ అలంకారంపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఇందుకు దాతలు విరాళాలు ఇచ్చారు.

రథోత్సవాల వేళ..

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట తయారైన కర్రల రథంలో స్వామివారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనికి అడపాదడపా మరమ్మతులు చేయిస్తూ ఉపయోగిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలకు రూ.50 లక్షలతో కర్రలతో మరో రథాన్ని తయారు చేయించగలిగితే శోభాయాత్రకు ఇబ్బంది రాకుండా చూడవచ్చు. ఆలయం నుంచి తాత గుడి వరకు సాగే రథోత్సవాలలో విద్యుత్తు తీగలు తగలకుండా ఈ రథం రూపకల్పన ఉండాలి.

15న దాతలకు సన్మానం..

రూ.లక్షకు పైబడి విరాళాలు అందించిన దాతలకు 15న రామాలయంలో సన్మానం చేసేందుకు దాతలకు ఈఓ రమాదేవి ఆహ్వాన పత్రికలను పంపారు. దాదాపు వెయ్యి మంది ఈ కోవలో ఉంటారని అంచనా. ఆ రోజు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించి సన్మానం చేయనున్నారు. గత ఏడాది ఇలాగే సన్మానం చేయగా విరాళాలు పెరిగినట్లు భావిస్తున్నారు.

ధైర్యలక్ష్మీ పాలయమాం!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి అలంకరణలు, పూజాది కార్యక్రమాలు జరిగాయి. శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో అమ్మవారు ధైర్యలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి మానసాదేవి అలంకరణ చేశారు. జమ్మిబండ, ప్రశాంతినగర్, గాంధీచౌక్‌లోని మండపాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

– ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే



శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ధైర్యలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



జమ్మిబండ వేదికపై అమ్మవారికి పూజలు



ప్రశాంతి నగర్‌లో..

రామయ్యకు బంగారు తులసీ దళార్చన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. బంగారు తులసి పూజలను ఘనంగా కొనసాగించారు. పసిడితో తయారు చేసిన తులసీ దళాలను సీతారాముడి పాదాల చెంత ఉంచి అర్చన నిర్వహించారు. వైదిక పెద్దలు క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేసిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. నిత్య కల్యాణంలో భాగంగా జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ కొనసాగించారు. తలంబ్రాల వేడుక నిర్వహించారు. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. ఆదివారం మూలవిరాట్‌కు అభిషేకం చేస్తారు. బంగారు పుష్పార్చన నిర్వహించనున్నారు.

ఆర్డీఓకు భూసేకరణ బాధ్యత.. రామాలయం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మొదటి విడతగా రూ.60.20 కోట్లను ప్రభుతం మంజూరు చేసింది. ఈ మొత్తంతో మాడ వీధులను విస్తరించాల్సి ఉండగా 46 ఇళ్లు అడ్డుగా ఉన్నాయి. ఇందులో ఒకరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇళ్లను కోల్పోయే నిర్వాసితులతో చర్చించి ఒప్పించేందుకు ఆర్డీఓ దామోదర్‌రావుకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఇళ్లను తొలగించి సుమారు ఎకరం స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఇదే క్రమంలో బాధితులకు పరిహారం ఇవ్వడంతో పాటు మెరుగైన పునరావాసం కల్పించేందుకు ఆర్డీఓ చర్యలు చేపట్టనున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం



కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన కొత్తగూడెంకు చెందిన కానిస్టేబుల్ రమణారెడ్డి కుటుంబానికి 2000 బ్యాచ్ కానిస్టేబుల్స్ రూ.2 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో ఎస్పీ బి.రోహిత్‌రాజు చేతుల మీదుగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, 15 మంది కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఆరుగురు జీఎంల బదిలీ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి మైనింగ్ విభాగంలో ఆరుగురు జనరల్ మేనేజర్లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీఎం ఇన్ఫర్మేషన్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అయినాల రవికుమార్‌ను క్వాలిటీ మేనేజ్‌మెంట్‌కు, పర్యావరణ జీఎం ఎ.మనోహర్ కార్పొరేట్ ప్రాజెక్టు, ప్లానింగ్‌కు, క్వాలిటీ మేనేజ్‌మెంట్ జీఎ ఆర్. నారాయణరావు రీసెర్చ్, డెవలప్‌మెంట్‌కు, రీసెర్చ్, డెవలప్‌మెంట్ జీఎం బానోతు సైదులును పర్యావరణ విభాగానికి, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ జీఎం విజయభాస్కరరెడ్డిని కాంట్రాక్టు మేనేజ్‌మెంట్ విభాగానికి, మరో జీఎం బత్తుల శ్రీనివాసరావును ఇన్ఫర్మేషన్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ విభాగానికి జీఎంగా బదిలీ చేశారు.

మరో నలుగురు అధికారులకు..

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో నలుగురు అధికారులను బదిలీ చేస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోలేటి ఓసీలో డీవైజీఎంగా పనిచేస్తున్న నాయని ఉమాకాంత్‌ను బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా, శ్రీరాంపూర్‌లోని టింబర్‌యార్డులో అదనపు మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.జక్కారెడ్డిని శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా, శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారి సిలివేరి మురళీమోహన్‌ను భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా, భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారి టి.రవిని శ్రీరాంపూర్ ఓసీ-2 సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు.

మరింత మెరుగ్గా ఆర్టీసీ పార్సిల్ సేవలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం రీజియన్‌లో 35 లాజిస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ లాజిస్టిక్ ఏటీఎం ఎ.పవన్‌కుమార్ తెలిపారు. గతంలో బస్టాండ్లకే పరిమితమైన సేవలను గ్రామీణ, మండల కేంద్రాలకు విస్తరించినట్లు వెల్లడించారు. అతి తక్కువ ధరలకే వినియోగదారుల పార్శిళ్లను ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్యమైన పట్టణాలు, బెంగళూరు నగరానికి చేరవేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు app.tgsrtclogistics.co.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. రీజియన్‌లో సేవల కోసం ఖమ్మం-91542 98583, మధిర-91542 98582, సత్తుపల్లి-91542 98585, కొత్తగూడెం-91542 98587, భద్రాచలం-91542 98586, మణుగూరు-91542 98588 నెంబర్లను సంప్రదించాలని స్పష్టం చేశారు.

జీవీ మాల్ నూతన షోరూం ప్రారంభం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం ప్రజల అభిమానం మరువలేనిదని ప్రముఖ సినీ కథానాయిక కీర్తి సురేష్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు చైతన్యనగర్ వద్ద 'జీవీ మాల్' నూతన షోరూం శనివారం ప్రారంభమైంది. తొలుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభించారు. అనంతరం వచ్చిన కీర్తి సురేష్ జ్యోతి వెలిగించారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. జీవీ మాల్ 17వ స్టోర్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అన్ని వయసుల మహిళలకు నచ్చేలా చీరలు, ఆధునిక వస్త్రాలు బాగున్నాయని, పండుగ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు హైపర్ ఆది, రాంప్రసాద్ చేసిన కామెడీ ప్రదర్శనలు అభిమానులను అలరించాయి. జీవీ మాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. వైరా రోడ్డులో 45 వేల అడుగుల విస్తీర్ణంలో భారీ షోరూంను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. అపరిమిత కలెక్షన్లు, అద్భుతమైన మోడల్స్‌లో అందుబాటు ధరల్లో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో గుర్రం వాసు, గుర్రం మురళీ, కుటుంబ సభ్యులు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు, షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న సినీనటి కీర్తి సురేష్, చిత్రంలో జీవీ మాల్ యాజమాన్యం కుటుంబ సభ్యులు

ఉదయం, సాయంత్రం.. నడకయాతన



పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ మొత్తం 450 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య అభ్యసిస్తున్నారు. బస్టాండు నుంచి కళాశాలకు ప్రత్యేకంగా రవాణా సదుపాయం లేకపోవడంతో.. ఉదయం, సాయంత్రం మొత్తం 6 కిలోమీటర్ల దూరం నడిచి రావాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. బస్సు సదుపాయం కల్పించాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' కళాశాల నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యను ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు వివరించి పరిష్కారానికి చొరవ తీసుకొంటామన్నారు. – కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

మురిపించేలా మ్యూజియాన్ని సిద్ధం చేయండి: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏలోని గిరిజన మ్యూజియానికి వచ్చే పర్యాటకులు మురిసిపోయేలా ఏర్పాట్లు చేపట్టాలని పీఓ రాహుల్ సూచించారు. రెండు నెలల్లోగా నిర్ణయించిన అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో కలిసి మ్యూజియాన్ని సందర్శించారు. రామాలయ దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కడ చూడదగిన ప్రదేశంగా దీన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వెదురు కుటీరాలను, కుర్చీలు, బల్లలు, సోఫాలను నిర్మించాలని, పిల్లలను ఆకట్టుకునేలా మట్టితో ఇళ్లను తయారు చేయాలని, చేపల కొలను నిర్మించాలని సూచించారు. సెల్ఫీలు దిగేందుకు ప్రత్యేక విభాగాన్ని తయారు చేయాలన్నారు. గిరిజన వంటల రుచిని చూపించేందుకు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెరగాలి.. ప్రాథమిక స్థాయిలోనే ప్రతి విద్యార్థి సామర్థ్యం పెరగాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. తన కార్యాలయంలో వేదిక్ గణిత ఉపాధ్యాయులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగహారాలు తప్పనిసరిగా రావాలని, ఇందుకు సులభమైన పద్ధతుల్లో బోధన సాగించాలని వెల్లడించారు. ఆంగ్లం, గణితంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటేలా బోధించాలని సూచించారు. యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



మ్యూజియం వద్ద పరిశీలిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం

సత్తుపల్లి, కల్లూరు, న్యూస్‌టుడే: జార్ఖండ్ రాష్ట్రం సిండేగా జిల్లాలోని ఆల్బర్ట్ ఎక్కా స్టేడియంలో సెప్టెంబరు 28నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన 34వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో టోర్నీలో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు చీకటి శ్రీదేవి రాష్ట్ర జట్టుకు మేనేజర్, కోచ్‌గా వ్యవహరించారు. సెమీస్‌లో కర్ణాటకపై విజయం సాధించిన తెలంగాణ ఫైనల్స్‌లో మహారాష్ట్రతో తలపడి ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ బాధ్యులు, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయులు జట్టుకు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. శ్రీదేవి తమ కుమార్తె యోజిత జ్ఞాపకార్థం 18 మంది క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు.



ద్వితీయ బహుమతితో టీమ్ మేనేజర్ శ్రీదేవి, విద్యార్థులు

ముగిసిన రెజ్లింగ్ పోటీలు

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) బాలికల రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-17 విభాగంలో 65 కిలోల విభాగంలో గీతాహర్షిణి (ఖమ్మం) విజేతగా నిలిచారు. విజేతలు జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.

గెలుపొందిన ఖమ్మం జట్టు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. బాలికల విభాగంలో పూల్-ఏలో ఖమ్మం జట్టు విజయం సాధించింది.

102 వాహనంలో అక్రమంగా టేకు కలప తరలింపు..!



దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిననల్లబెల్లి-రాయిగట్టు గ్రామాల సమీపంలో 102 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మెలను పోలీసులు పట్టుకున్నారు. చిననల్లబెల్లి-రాయిగట్టు గ్రామాల వైపు సీఐ అశోక్ తన సిబ్బందితో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో 102 వాహనం డ్రైవర్ నవీన్ జిన్నెలగూడెం గ్రామం నుంచి టేకు దిమ్మెలను అక్రమంగా మోరంపల్లి బంజర్ వైపు తరలిస్తున్నాడు. అనుమానంతో సీఐ అశోక్ వెంటనే వాహనాన్ని చిననల్లబెల్లి-రాయిగట్టు వద్ద తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా డ్రైవర్ నవీన్ అతివేగంతో వాహనాన్ని నడుపుతూ మార్గంమధ్యలో వదిలేసి చాకచక్యంగా తప్పించుకొని పారిపోయాడు. అదే సమయంలో శ్యామల పాపారావు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 102 వాహనాన్ని అనుసరిస్తున్నాడు. ఈ వ్యవహారంలో అతనికీ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించి వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని టేకు కలపతో పాటు 102 వాహనాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఏడు టేకు దిమ్మెల ఖరీదు సుమారు రూ.83,094 ఉన్నట్లు అటవీ శాఖ సిబ్బంది అంచనా వేశారు. ఫారెస్టు రేంజి అధికారి కమల కేసు దర్యాప్తు చేపట్టారు.

రూ.30 లక్షల రాగితీగ చోరీ

వేంసూరు, న్యూస్‌టుడే: యర్రసానివారిబంజరులోని వేంసూరు ఎత్తిపోతలకు సంబంధించిన అయిదు విద్యుత్తు నియంత్రికలను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం పగులగొట్టి వాటిలో రాగితీగను అపహరించుకు వెళ్లారు. ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు రంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె



అశ్వాపురం, న్యూస్‌టుడే: మిట్టగూడెంలోని రథంగుట్ట వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో పని చేసే కాంట్రాక్టు కార్మికులు శనివారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాల కోసం గత 32 రోజులుగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టినా తమ సమస్య పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక నిరవధిక సమ్మెకు పూనుకున్నట్లు వెల్లడించారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎదుట సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐక్య పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పాయం నాగరాజు, బి.సతీశ్, లక్ష్మణ్, సైదులు పాల్గొన్నారు.

భద్రాచలం
• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

రామయ్యను దర్శించుకున్న అధికారి

భద్రాచలం, న్యూస్‌టుడే: లేబర్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ శనివారం రాత్రి భద్రాచలం రామాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు.



రామయ్యను దర్శించుకున్న సంజయ్‌కుమార్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) భద్రాచలం: 79950 67029 అశ్వారావుపేట: 80085 73696 పినపాక: 91212 29033



సమస్య: పాతర్లలోని అభయాంజనేయస్వామి ఆలయం పక్కనున్న తాగునీటి బావి పరిసరాలు చెత్తా చెదారంతో పాటు బురదమయంగా మారాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. బావి చుట్టూ ఉన్న చెత్త, బురద తొలగించాలి. - స్థానికులు

సమాధానం: ఈ సమస్య ఈనాడు నా దృష్టికి వచ్చింది. తప్పనిసరిగా బావి చుట్టూ శుభ్రం చేయిస్తాం. - తోకల సురేశ్, పంచాయతీ ఈవో - చర్ల, న్యూస్‌టుడే

బతుకమ్మ ఘాట్లలో పారిశుద్ధ్య చర్యలు

స్పందనకు వందనం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలోని కోనేరు చెరువు, దొంతికుంట చెరువు బతుకమ్మ ఘాట్లలో అపరిశుభ్ర వాతావరణంపై ఈనెల 4న 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీరామ్మూర్తి స్పందించారు. చెరువుల వద్ద బతుకమ్మ ఘాట్‌లను శుభ్రం చేయించారు.

అన్నపూర్ణాదేవిగా జగన్మాత

బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, న్యూస్‌టుడే: బూర్గంపాడు మండలం సారపాక వర్తక సంఘం ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల్లో శనివారం అన్నపూర్ణాదేవి అవతారం సందర్భంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ✦ కరకగూడెం రామాలయంలో దుర్గాదేవి అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిదేవిగా అలంకరించారు. ✦ పినపాక మండలం పోతిరెడ్డిపల్లిలో కొలువుదీరిన అమ్మవారు శనివారం భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

అశ్వారావుపేట, అశ్వారావుపేట గ్రామీణం, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు. శ్రీరంగాపురం శ్రీవిజయదుర్గమ్మ, మామిళ్లవారిగూడెం, వినాయకపురం, నారాయణపురం, గాండ్లగూడెం, అనంతారం, జమ్మిగూడెం, తిరుమలకుంట ఆలయాల్లో ఘనంగా పూజలు సాగాయి. దమ్మపేట శ్రీ యత్రీ ఆశ్రమం, నాచారం లక్ష్మీనరసింహస్వామి, వడ్లగూడెం దుర్గామల్లేశ్వరస్వామి, దమ్మపేట శ్రీవిశ్వేశ్వరాలయం, నాగుపల్లి శివాలయాల్లో విశేష పూజలు సాగాయి. అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో, శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వద్ద శ్రీమంగళగౌరి అలంకారంలో శనివారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



సారపాకలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



అన్నపురెడ్డిపల్లిలో



అశ్వారావుపేటలో..



మామిళ్లవారిగూడెంలో



బూర్గంపాడులో..

తాగునీటి సరఫరాలో ఇబ్బందులుండవ్

100 మంది తాగునీటి సహాయకులకు 4 అంశాల్లో శిక్షణ

మిషన్ భగీరథ మణుగూరు డీఈ బ్రహ్మదేవ్



ముఖాముఖి

మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలోని పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాలకు చెందిన మొత్తం 100 మందికి గ్రామ తాగునీటి సహాయకులుగా శిక్షణ అందిస్తున్నాం. ప్రస్తుతం 80 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరందరికీ హైదరాబాద్‌లో శిక్షణ పొందిన వారిచే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. గ్రామీణ స్థాయిలో 4 అంశాలపై వీరికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. వీటిలో సింగిల్ ఫేజ్, త్రిఫేజ్ విద్యుత్తు మోటార్ల మరమ్మతులు, చేతిపంపులు, బోర్‌వెల్స్, గొట్టపు మార్గాల్లో లీకులు అరికట్టడం, మంచి నీటి శుద్ధిపై శిక్షణ ఇస్తున్నాం.

తాగునీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి, అంతరాయం లేకుండా సరఫరాకు గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాలు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందిన వీరంతా గ్రామాల్లో చేతిపంపులు, ప్రభుత్వ సంబంధిత విద్యుత్తు మోటార్లు, గొట్టపుమార్గాలు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఈక్రమంలో మణుగూరు డివిజన్ పరిధిలో చేపట్టిన ఈ కార్యక్రమంపై మిషన్ భగీరథ మణుగూరు డీఈ బ్రహ్మదేవ్ 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ వివరాలు.. - పినపాక, న్యూస్‌టుడే

మండల కేంద్రాల్లో శిక్షణ

ఎంపిక చేసిన గ్రామ తాగునీటి సహాయకులకు మండల కేంద్రంలోని రైతు వేదికల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భోజన వసతి సైతం ఏర్పాటు చేస్తున్నాం.

త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా..

గతంలో గ్రామాల్లో చోటుచేసుకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటే మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మాత్రమే రావాల్సి వచ్చేది. ఈ తరుణంలో చాలా రోజుల వరకు సమస్యకు పరిష్కారం లభించేదికాదు. వీటన్నింటిని అధిగమించేలా ఏర్పాటు చేస్తున్న ఈ సహాయకులు పంచాయతీకి ఒక్కరు చొప్పున ఉంటున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుంది. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించగలుగుతాం.

వ్యాను బోల్తా.. నలుగురికి గాయాలు

గుండాల, న్యూస్‌టుడే: ధాన్యం లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం బ్రేకులు ఫెయిలై కొమరారం సమీపంలో బోల్తా పడింది. ఆ వాహనంలో డ్రైవరుతోపాటు నలుగురు రైతులు ఉన్నారు. అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

పింఛను ఇవ్వడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: కోడలు పేర బ్యాంకులో అప్పు ఉండటంతో తనకు వచ్చే పింఛను ఇవ్వకుండా చంద్రుగొండ ఏపీజీవీ బ్యాంకు మేనేజరు హోల్డ్‌లోపెట్టి ఇబ్బంది పెడుతున్నారని రావికంపాడుకుచెందిన వృద్ధుడు రెడ్డిపోగు గోపయ్య శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్‌ను వివరణ కోరగా తాను హోల్డ్‌లో పెట్టలేదని, వృద్ధుడు తన వద్దకే రాలేదని తెలిపారు. ఖాతాలో పడ్డ సొమ్ము ఆయన ఎప్పుడైనా తీసుకోవచ్చన్నారు.

వేధింపుల ఘటనపై కేసు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం వెంకటేశ్వర కాలనీకి చెందిన భవాని-శ్రీనివాసరెడ్డి భార్యాభర్తలు. తరచూ తనను కట్నం కోసం భర్త వేధిస్తున్నారని బాధితురాలు భవానీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పీవీఎన్ రావు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మికుల సహకార సంఘం ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అందించిన రక్షణ కవచం కిట్‌లను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ అభివృద్ధి సంఘం జిల్లా అధికారిణి ఇందిర, సహాయ అధికారిణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దామోదర్‌రావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 15 మందికి కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం కిట్‌లను అందించినట్లు వివరించారు. ఆబ్కారీ ఎస్సై సీతారామరాజు, కాంగ్రెస్ నాయకులు రత్నం రమాకాంత్, రాజీవ్, నవాబు, రజనీకాంత్, సుధాకర్, వెంకటరెడ్డి, గౌడ సోదరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టర్ వంశీకి ఐటీసీ రూ.50 వేల విరాళం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మొడెం వంశీకి చేయూతగా ఐటీసీ సంస్థ రూ.50 వేల చెక్కును శనివారం అందజేసింది. వంశీ పేరిట చెక్కును ఐటీసీ అధికారి చంగల్‌రావు సీటీస్టైల్ జిమ్ నిర్వాహకుడు రామిరెడ్డికి అందజేశారు. వంశీ ఇటీవల యూరప్ ఖండం మాల్టాలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సౌత్ ఆఫ్రికాలోని సన్ సిటీలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొంటున్నాడు. అతని ఖర్చులకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఐటీసీ సంస్థ ముందుకు వచ్చి విరాళం అందజేసింది.

7న ఐటీడీఏ ఎదుట 'ఆకలి కేక' దీక్ష

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఈనెల 7నుంచి 'ఆకలి కేక' దీక్షలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌ఎం వసతి గృహాల్లో పనిచేస్తున్న పొరుగు సేవల కార్మికులకు 20 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వారెలా బతకాలని ప్రశ్నించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు.

తలనీలాల సేకరణ వేలం వాయిదా

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయానికి వచ్చే భక్తులు మొక్కుల్లో భాగంగా కల్యాణ కట్టలో తలనీలాలను సమర్పిస్తుంటారు. వీటిని సేకరించి విక్రయించుకునేందుకు గుత్తేదారుకు హక్కులు కల్పిస్తారు. ఇందుకు సంబంధించిన వేలం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించగా సరైన పోటీ లేని కారణంగా ఉన్నతాధికారులు దీన్ని వాయిదా వేశారు. గత ఏడాది రూ.1.15 కోట్ల ఆదాయం ఈ విభాగం ద్వారా వచ్చింది.

మెప్మా అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు పురపాలక పరిధిలోని మెప్మాలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న మెప్మా బాధితుల దీక్షా శిబిరాన్ని శనివారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కుటుంబరావు, రమేష్, సీతారాములు, ఉమర్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తాం'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి తామంతా చిత్తశుద్ధితో పని చేస్తామని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రాంగోపాల్ అన్నారు. మణుగూరు ఏరియాలోని వర్క్‌షాపు, ఆటో వర్క్‌షాపుల వద్ద శనివారం నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాంనర్సయ్య, ఈశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులు'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: దసరా నేపథ్యంలో మణుగూరు నుంచి ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్ అన్నారు. స్థానిక సురక్షా బస్టాండ్ వద్ద శనివారం బస్సుల రాకపోకల వివరాలను ఆయన పరిశీలించారు. దసరా రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు.

బీడు కాదు.. చెరువే..!

గుండాల మండలం మోదుగులగూడెం గ్రామానికి చెందిన గడ్డిచెరువు పేరుకు తగ్గట్టుగానే నీరు కనిపించకుండా పూర్తిగా గడ్డితో కప్పేసింది. పసుపుపచ్చ రంగుతో కోత దశకు చేరుకున్న వరి చేను మాదిరిగా దర్శనమిస్తోంది. గుండాల-ఇల్లెందు ప్రధాన రహదారి పక్కనే ఉంది. నెల రోజులపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చి చూసిన వారందరూ చెరువు మాయమై వరి చేను ఎక్కడి నుంచి వచ్చిందన్నట్లుగా ఆశ్చర్యంగా చూస్తున్నారు. - గుండాల, న్యూస్‌టుడే



రేకులే రక్షణగా..!



అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం - గుర్రాలచెరువు దారిలో జులైలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు గండి పడింది. దీన్ని తాత్కాలికంగా మట్టితో పూడ్చివేశారు. సెప్టెంబరులో మళ్లీ భారీ వర్షాలు కురవడంతో మళ్లీ అక్కడే రెండోసారి గండిపడి ప్రమాకరంగా మారింది. వాహనదారులు దగ్గరకు వెళ్లేవరకు అది కనిపించదు. దీనిని అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే ప్రమాదకరంగా ఉన్న చోట హెచ్చరికగా పాత సిమెంటు రేకులను ఇలా ఉంచారు. ఇక్కడి పరిస్థితిపై పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీధర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఈ రహదారి మరమ్మతుల కోసం రూ.2.10లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. - అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

పల్లెల ప్రగతికి కృషి: పాయం

అశ్వాపురం, మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి కట్టుబడి కృషి చేస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వాపురం మండలం తురమలగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో రూ.12.5 లక్షలతో నిర్మించిన పలు సిమెంట్ రహదారులను శనివారం ఆయన ప్రారంభించారు. నియోజకవర్గానికి 4,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయన్నారు. వీటిని అర్హులైన నిరుపేదలకే అందజేస్తామన్నారు. ప్రస్తుతం ప్రత్యేకించిన గ్రామాల్లో ఫ్యామిలీ హెల్త్ డిజిటల్ కార్డ్ పైలట్ ప్రాజెక్ట్ సర్వే కొనసాగుతోందని, తర్వాత ప్రతి గ్రామంలో ఆ సర్వే జరుగుతుందన్నారు. ఆ కార్డులోనే అన్ని వివరాలు ఉంటాయన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్యను సందర్శించి పరామర్శించారు. తహసీల్దారు బి.స్వర్ణ, వివిధ విభాగాల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు పలువురు తమ సమస్యలను విన్నవించారు. వినతిపత్రాలను సమర్పించారు.

✦ గత నాలుగు నెలలుగా మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో వారు నిరవధిక సమ్మెకు పూనుకున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సత్వరమే వారికి జీతాలు చెల్లించాలని ఆదేశించారు.

✦ బట్టీలగుంపు, బట్టా మల్లయ్యగుంపు, రాంనగర్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిశారు. ఏటా తమ గ్రామాలు గోదావరి ముంపునకు గురవుతున్నందున తమ గ్రామాలను మెరక ప్రదేశాలకు తరలించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

✦ విద్యార్థులు నేటి సాంకేతిక ప్రపంచంలో శిక్షణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న ఏటీసీ భవనానికి శనివారం పాయం భూమిపూజ చేశారు. బడుగు ప్రభాకర్, టీవో రవి, సూపరింటెండెంట్ జ్యోతి రాణి, సిబ్బంది సయ్యద్, మయ్యా శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



గొల్లగూడెంలో సిమెంట్ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దత్తత గ్రామాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలంలోని తిప్పనపల్లి పంచాయతీ మహ్మద్‌నగర్ గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకున్నానని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మహ్మద్‌నగర్ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. పైలాన్‌ని ఆవిష్కరించారు. ఈజీఎస్ పథకం కింద రూ.1.85 కోట్లతో గ్రామంలో సీసీ రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అన్నారంతండాలో నీతి ఆయోగ్ పథకం కింద రెండు అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆ పనులను ఆరంభించారు. టేకులబంజర్‌లో గ్రావెల్ రోడ్ల పనులు ప్రారంభించారు. పంచాయతీరాజ్ డీఈ సైదుల్‌రెడ్డి, ఎఈలు శ్రీనివాసరావు, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, ఏడుకొండలు, పార్వతి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్‌లో మాట్లాడుతున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అక్రమ కేసులపై విచారణ జరపాలి: రేగా

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పినపాక నియోజకవర్గంలో భారాస నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ రోహిత్‌రాజ్‌కు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. రేగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని మండలాల భారాస నాయకులు, కార్యకర్తలపై స్థానిక కాంగ్రెస్ నేతలతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బలవంతంగా పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెట్టిస్తున్నారన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి అక్రమ కేసులు కాంగ్రెస్ నాయకులపై పెట్టలేదని, భారాస నాయకులెవ్వరూ కేసులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. భారాస నాయకులు నర్సింహారావు, ముత్యంబాబు, నాగేశ్వరరావు, రాంబాబు, రమేష్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.



ఎస్పీ రోహిత్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

ఘనంగా వెంకటస్వామి జయంతి

భద్రాచలం, న్యూస్‌టుడే: గడ్డం వెంకటస్వామి సామాజిక సంక్షేమానికి అంకితమై సేవచేసిన నాయకుడిగా, రాజకీయ వేత్తగా, ప్రజా ప్రతినిధిగా ప్రత్యేక స్థానాన్ని పొందారని ఐటీడీఏ పీఓ రాహుల్ పేర్కొన్నారు. వెంకటస్వామి జయంతిని శనివారం ఐటీడీఏలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల దండలు అలంకరించి నివాళులర్పించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జునరావు, ఈఈ తానాజీ, యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

మణుగూరు సాంస్కృతికం: తెలంగాణ తొలితరం ఉద్యమనేత జి.వెంకటస్వామి స్ఫూర్తితో సింగరేణిలో విలువైన సేవలు అందించాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. మణుగూరులోని జీఎం కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతి నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ వెంకటస్వామి కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి ఉద్యోగులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడానికి విశేషంగా కృషిచేశారన్నారు. ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్, పర్సనల్ మేనేజర్ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి శనివారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



భద్రాచలం: వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పీఓ రాహుల్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: వనజీవి రామయ్య

చంద్రుగొండ, న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, యువత అన్ని రంగాల్లో రాణించాలని పద్మశ్రీ ఆవార్డు గ్రహీత వనజీవి రామయ్య అన్నారు. చంద్రుగొండ మండలం బెండాలపాడులో 70వ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా శనివారం తల్లాడ, చంద్రుగొండ రేంజిల పరిధిలో యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వనజీవి రామయ్య చేతుల మీదుగా బహుమతులందజేశారు. తల్లాడ డిప్యూటీ రేంజర్ సురేష్, సెక్షన్ అధికారి శివకుమార్, బీట్ అధికారి జాన్ ప్రదీప్‌కుమార్, మాజీ సర్పంచి పూసం వెంకటేశ్వర్లు, బొర్రా లలిత, నవీన్‌కుమార్, బొర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బెండాలపాడులో విజేతలకు బహుమతులందజేస్తున్న పద్మశ్రీ ఆవార్డు గ్రహీత వనజీవి రామయ్య

చర్ల, న్యూస్‌టుడే: వన్యప్రాణులను సంరక్షించాలని అటవీ క్షేత్రాధికారి ద్వాలియా పిలుపునిచ్చారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కందిపాడులో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అడవులను రక్షించడం అందరి బాధ్యతన్నారు. అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంతి గదిని కేటాయించాలి

మణుగూరు సాంస్కృతికం: మణుగూరు ఏరియాలోని కొండాపురం సీఎస్పీ రైల్వే సైడింగ్ వ్యాగన్ చెకింగ్ వద్ద పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు విశ్రాంతి గదిని ఏర్పాటుచేయాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో శనివారం ఏరియా ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు.

రేడియం స్టిక్కర్ల ఏర్పాటు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో పలు ట్రాక్టర్లకు, ట్రక్కులకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. వీటికి రేడియం స్టిక్కరింగ్ వేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహన చోదకులకు తెలికగా అక్కడ వాహనం ఉన్నట్లు అర్థమవుతుందన్నారు.

బదిలీలకు తప్పుడు ధ్రువపత్రాలు..?

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ఐటీడీఏ డీడీ కార్యాలయం పరిధిలోని ఇద్దరు ఉపాధ్యాయులను శుక్రవారం మధ్యంతరంగా బదిలీ చేయక తప్పలేదు. అక్రమాలపై ఇదే శాఖ ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనికి సంబంధించిన వివరాలను పరిశీలిస్తే.. సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల అర్హులకు స్థాన చలనం కల్పించారు. ఇందులో ఇద్దరు ఉపాధ్యాయులు తమకు నచ్చిన చోట్ల పోస్టింగులు పొందేందుకు తప్పుడు పత్రాలను దరఖాస్తులో జత చేశారు. మెడికల్ ధ్రువీకరణ పత్రం ఉంటే బదిలీల్లో ముందు వరసలో ఉండొచ్చు. ఇది ఆ ఉపాధ్యాయులకుగానీ వారి పిల్లలకుగానీ చెందిన పత్రం అయి ఉండాలి. దానిని అవకాశంగా తీసుకున్న ఇద్దరు ఉపాధ్యాయులు తమ తండ్రుల ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ పత్రాలను పొందుపర్చి నచ్చిన చోటకు వెళ్లారు. దీనిపై ఓ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ సాగింది. ఆ నివేదిక ఆధారంగా ఇద్దరినీ శుక్రవారం మరో చోటకు బదిలీచేశారు. ధ్రువపత్రాలను పరిశీలించేందుకు కార్యాలయంలో ప్రత్యేక బృందం ఉన్నప్పటికీ ఇలా ఎందుకైందన్నది సందేహాలను కలిగిస్తోంది. వీరిద్దరిపై చర్యలు స్థాన చలనంతో సరిపెడతారా తప్పుడు పత్రాలు అందించినందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారా అన్నది తెలియాల్సి ఉంది. ఇదే అంశంలో ఫిర్యాదు చేసిన వారిపైనా కొన్ని అభియోగాలు వచ్చాయి. ఆ విచారణ సైతం పూర్తయింది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ నివేదికలు పరిశీలించి ఇద్దరు ఉపాధ్యాయులను బదిలీ చేశామని డీడీ మణెమ్మ తెలిపారు.

అధ్వానంగా గ్రామ పంచాయతీ కార్యాలయం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

మండల పరిధిలో నర్సాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం అధ్వానంగా తయారైంది. కార్యాలయం గదులు శిథిలావస్థకు చేరాయి. వాటిలోనే బ్లీచింగ్, సున్నం బస్తాలు, కార్యాలయం రికార్డులు వివిధ సామగ్రి నిల్వ చేస్తున్నారు. కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తాచెదారం చేరి పారిశుద్ధ్యం లోపించింది. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్మికులు, వచ్చి పోయే ప్రజలు కనీసం కుర్చునేందుకూ సరైన గది లేకపోవడంతో చేసేదేమీలేక ప్రస్తుతం గ్రంథాలయం గదిలోనే గ్రామ పంచాయతీ కార్యాలయం వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య పరిరక్షణ చర్యలు లోపించడంతో పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని సుమారు రూ.20 లక్షలు వ్యయంతో చేపట్టారు. కొంతకాలంగా దాని నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పంచాయతీ కార్యదర్శి యాకుబ్ మాట్లాడుతూ నూతన భవనం నిర్మాణం పూర్తయితే సమస్యల తొలగుతుందని, గ్రామ పంచాయతీ కార్యక్రమాలు అక్కడ నిర్వహిస్తామని తెలిపారు.



గ్రామ పంచాయతీ ఆవరణలో పిచ్చి మొక్కలు

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మైదానంలో నిర్వహిస్తున్న రీజనల్ ఫుట్‌బాల్ పోటీలను జీఎం జాన్ ఆనంద్ శనివారం ప్రారంభించారు. ఎస్వోటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సంఘాల నాయకులు నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, సాయి స్వరూప్ పాల్గొన్నారు. ★ మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ నివాళులు అర్పించారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు

స్త్రీనిధి రుణాల రికవరీకి ప్రణాళిక

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జిల్లాలో స్త్రీనిధి రుణాలను తిరిగి రాబట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్తున్నట్లు స్త్రీనిధి జిల్లా మేనేజర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. జూలూరుపాడు సెర్ప్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, వీవోఏలతో రుణాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సహాయ మేనేజర్ సంపత్‌కుమార్, సీసీలు మధు, రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: నేతాజీ మార్కెట్ నుంచి గణేశ్‌బస్తీకి వచ్చే దారిలో.. మూలమలుపుల మధ్య ఉన్న చేతిపంపు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. - స్థానికులు

సమాధానం: చేతిపంపును పరిశీలిస్తాం. దాన్ని తొలగించి ప్రత్యామ్నాయంగా వేరేచోట ఏర్పాటు చేస్తాం. - శేషు, కమిషనర్

✆ 16వ వార్డులో సీసీ రహదారులు నిర్మించినా.. మార్జిన్లను చదును చేయకుండా ప్రమాదకరంగా వదిలేశారు. - ఓ పాఠకుడు

✔ గుత్తేదారుడితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- రాజకుమారి, వార్డు కౌన్సిలర్

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

కళాశాలల్లో 'ఎన్‌పీటీఈఎల్' కేంద్రాలు

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి మహిళా డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) కేంద్రాలు మంజూరైనట్లు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగాధిపతి, పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ విభాగాధిపతిని సమన్వయకర్తగా నియమిస్తున్నట్లు చెప్పారు.

21 మందికి ఉద్యోగావకాశాలు

కొత్తగూడెం సంక్షేమ విభాగం: కొత్తగూడెం బాబుక్యాంపులోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 32 మంది హాజరయ్యారు. వారిలో 21 మందిని ఎంపిక చేసిన ఓ ప్రైవేటు సంస్థ నియామక పత్రాలను అందజేసింది. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ పర్యవేక్షించారు.

కలెక్టరేట్ ఎదుట బీజేపీ నిరసన


కొత్తగూడెం కలెక్టరేట్: ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో కొందరు సీపీఐ, కాంగ్రెస్ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పాల్గొని ప్రసంగిస్తున్నారని.. జలవిద్యుత్ సింగభూపాలెంలో మత్స్యశాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేనితో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు ప్రసంగించడాన్ని బీజేపీ జిల్లా నేత యెర్రా కామేశ్ తప్పుబట్టారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి.. ఏఓ రమాదేవికి శనివారం వినతిపత్రమిచ్చారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలి

కొత్తగూడెం పట్టణం: ఏబీసీడీలుగా ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని మాదిగ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు శనివారం కొత్తగూడెంలో వినతిపత్రం అందజేశారు. సమితి అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, శంకర్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, కొమరయ్య పాల్గొన్నారు.

పూబెల్లి.. పర్యాటకంగా వెలగాలి..

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే



చెరువు అందాలు..



'టూరిజం అంటే ఎత్తైన కొండలు.. భారీ భవనాలే కాదు! మన చుట్టూ ఉన్న ప్రదేశాలు ఆహ్లాదాన్ని పంచేలా, ఆకట్టుకునేలా ఉండాలి. సందర్శకులను 'మా ఊరికి రండీ' అనేంతగా ఆకట్టుకునేలా చేయగలగాలి' అన్నారు జిలా పాలనాధికారి జితేశ్ వి పాటిల్. అదీ.. ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామస్థులతో. ఆయన ఈ మాట ఎందుకన్నారు? అక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేయదగిన అంశాలేమిటో చూద్దాం..

కుటుంబ డిజిటల్ కార్డు సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఇల్లెందు నియోజకవర్గంలోని పూబెల్లి గ్రామాన్ని ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. రెండ్రోజుల క్రితం సర్వేను ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ పూబెల్లి గ్రామాన్ని సందర్శించారు. పట్టణానికి సుమారు పది కి.మీ. దూరంలో నున్న ఈ గ్రామంలో చెరువు పక్కన ఎత్తైన కొండ, చుట్టూ పచ్చని పొలాలు, రహదారికి ఇరువైపులా ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంది. ప్రకృతి అందాలపై ఆయన స్థానిక అధికారులు, గ్రామస్థులతో ముచ్చటిస్తూ.. 'పట్టణం, నగరాల్లో ఓ ప్రత్యేకమైన చోటుకు వెళ్లి రూ.500 వెచ్చించి బిర్యానీ తినేసి వస్తారు. కానీ, మన పల్లెల్లోని శివారుల్లో సందర్శకులు వచ్చే ప్రాంతాల్లో కేవలం మొక్కజొన్నలు వంటివి మాత్రమే అమ్ముతున్నాం. ఈ ప్రాంతం చెరువు, ఆహ్లాదకర వాతావరణంలో నలుగురూ కూర్చునేలా మంచె (పొలం మంచం), అక్కడో మసాలా చాయ్ కొట్టు, పెద్ద చెట్ల మధ్య ఉయ్యాలలు వంటివి ఏర్పాటు చేస్తే పర్యాటకంగా పేరొస్తుంది. పట్టణాల్లో 'థాలి' పేరిట ఆహారం అందిస్తారు. అదేతీరున చేపల పులుసు, బచ్చలకూర, మెంతికూర, పాలకూర, జొన్నరొట్టెలను కొంచెం అన్నంతో కలిపి అందించేలా ప్రణాళికలు చేయవచ్చు' అని అన్నారు.

● "గ్రామంలో 180 కుటుంబాలుండగా, జనాభా సుమారు 800. వ్యవసాయం చేస్తే ఎకరాకు సుమారు రూ.20 వేలకు మించి ఆదాయం లభించదు. ప్రస్తుత జీవన విధానానికి భిన్నంగా సందర్శకులను ఆకట్టుకొని, వారికి ఈ ప్రాంత అందాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు చేయొచ్చు. రుచి, శుచికరమైన ఆహారాన్ని అందిస్తే రోజుకు ఒక కుటుంబం రూ.2 వేల వరకు సంపాదించవచ్చు" అని కలెక్టర్ తెలియజెప్పారు.

మళ్లీ వస్తా.. అభివృద్ధిపై మాట్లాడదాం..

పూబెల్లిలో పచ్చందాల నడుమ కనిపించే చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అన్నారు. బోటు, నీటిపై నడిచే సైకిళ్లు వంటివి తాను సమకూర్చుతానని హామీ ఇచ్చారు. మళ్లీ వస్తానని.. గ్రామ పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకుందామని గ్రామస్థులు, స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్‌తో జితేశ్ వి పాటిల్ అన్నారు.



పచ్చందాల నడుమ పూబెల్లి గ్రామం..

తండ్రిపై దాడి చేసిన కొడుకు

ఇల్లెందు గ్రామీణం: మద్యం మత్తులో ఈ నెల 4న రాత్రి తన ఇంటికి వచ్చిన కుమారుడు పవన్‌కళ్యాణ్ రూ.50 వేలు ఇవ్వాలని అడిగాడని, డబ్బు ఇవ్వలేదన్న కోపంతో ఇటుకతో తలపై కొట్టాడని తండ్రి సముద్రాల శ్రీనివాస్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కొప్పుల లింగయ్య కేసు నమోదు చేశారు.

గుట్కాల స్వాధీనం: ఇల్లెందు నుంచి రొంపేడు మార్గంలో ఆటోలో శనివారం తరలిస్తున్న రూ.18 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునగలవీడుకు చెందిన దాసరి మురళి, దాసరి జంపయ్య, మాదగాని సుమన్, రాజులకొత్తపల్లికి చెందిన అంగడి సురేష్‌లు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సూర్యాపేటలో వారిని స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఈ ముఠా గతేడాది చుంచుపల్లి ఠాణా పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు డీఎస్పీ రవి వివరించారు. పది తులాల బంగారం, 75 తులాల వెండి, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనపర్చుకున్నామని డీఎస్పీ తెలిపారు.

ఎగుడు దిగుడు రోడ్డు ఎక్కేదెట్టా?



రేగళ్ల నుంచి గొల్లగూడెం వైపు నిర్మించిన అనుసంధాన మార్గం ఆరంభం వద్ద బాగా పల్లంగా ఉండటంతో వాహనాలు ఎక్కేందుకు, దిగేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. అంతర్గత పైపులతో ఎత్తు పెంచితే ఇబ్బంది ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శి పుల్లారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. కల్వర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు.

– లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే కోరం

టేకులపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ఈఎంఆర్ఎస్‌కు రూ.50 లక్షల ఐటీడీఏ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. 'ఈఎంఆర్ఎస్' రహదారి అధ్వాన స్థితిపై గతంలో 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. దీంతో నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నాగభవాని, ఎంపీడీఓ రవీందర్‌రావు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోరం సురేందర్, మాజీ సర్పంచులు చిన్ని, రెడ్యానాయక్, నాయకులు గణేష్, సామినేని సాయి, మధు రెడ్డి, సంజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం



పాల్వంచ: అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులు..



పాల్వంచ: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



పాల్వంచ: కొత్తగూడెం పట్టణం ప్రియదర్శిని కళాశాలలో..



కొత్తగూడెం కలెక్టరేట్: ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారులు, నర్సులు..

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..



కొత్తగూడెం కలెక్టరేట్: రైతుబజార్ మహిళలు..

కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలను కొత్తగూడెం పట్టణంలో ఘనంగా జరుపుకొంటున్నారు. రైతు బజార్‌లో మహిళలు రోజంతా వ్యాపారాలు చేసుకుంటూ.. రాత్రి బతుకమ్మలను పేర్చి సంబురాలు నిర్వహించుకుంటున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలందించే సిబ్బంది సాయంత్రం ఖాళీ సమయంలో ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద బతుకమ్మలను పేర్చి సందడి చేస్తున్నారు. కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాల్లోని విద్యాలయాల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాల, కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాలల్లో వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. మేదరబస్తీ 20వ వార్డులో అమ్మవారికి మూడో రోజు జరిపిన ప్రత్యేక పూజల్లో త్రీటౌన్ సీఐ శివప్రసాద్ దంపతులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. టేకులపల్లి కోదండరామాలయం, బ్రహ్మంగారి వీధి, బోడు, కోయగూడెం, కోయగూడెం ఓసీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలగూరులో అన్నదానం నిర్వహించారు. సులానగర్ పీహెచ్‌సీలో జరిగిన వేడుకల్లో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీనాయక్ పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండులో డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మహిళా సిబ్బంది, ప్రయాణికులు ఉత్సాహంగా బతుకమ్మలాడారు. పాత పాల్వంచ గడియకట్టలో మైసమ్మతల్లి ఆలయంలో దేవీనవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు గాయత్రిదేవీగా దర్శనమిచ్చారు. పూజల్లో డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.



కొత్తగూడెం పట్టణం: మేదరబస్తీలో సీఐ శివప్రసాద్ దంపతులు, స్థానికుల పూజలు



పాల్వంచ పట్టణం: పెద్దమ్మ ఆలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు..



కొత్తగూడెం పట్టణం: ఆర్టీసీ బస్టాండ్‌లో..



లక్ష్మీదేవిపల్లి: శ్రీనగర్ చండీసర్వజ్ఞ పీఠంలో కీర్తనలు ఆలపిస్తున్న వెంకట పద్మావతి శిష్య బృందం

వాహనం బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: గుండాల మండలం సాయనపల్లి నుంచి ఇల్లెందుకు వడ్ల బస్తాల లోడుతో వస్తున్న వాహనం కొమరారం-మామిడిగూడెం మధ్య శనివారం అదుపుతప్పి పడిపోయింది. ఆ సమయంలో వాహనంలో 8 మంది ఉండగా.. వారిలో శ్రీవర్ధన్, మరో బాలుడు గౌతమ్‌కు స్వల్పంగా గాయపడ్డారు. చరణ్, రాంబాబులకు తీవ్రగాయాలవగా వారిని ఇల్లెందు, అక్కడ్నుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

టేకులపల్లి, న్యూస్‌టుడే: పశువులను అక్రమ రవాణా చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి ఎస్సై పి.సురేశ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం బొలెరోలో ఎనిమిది ఆవు పెయ్యలను తరలిస్తున్న బేతంపూడికి చెందిన శ్యామ్, నరేశ్, పాల్వంచకు చెందిన ఖాసీం, ఇల్లెందుకు చెందిన మోబిన్‌లను స్థానికంగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టేకులపల్లి, న్యూస్‌టుడే: దాసుతండాకు చెందిన బానోత్ బుజ్జి(42) గతనెల 20న ఇంటి ఆవరణలో జారి కిందపడటంతో గాయాలయ్యాయి. ఆమె హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతురాలి సోదరి ఫిర్యాదుతో ఎస్సై సురేశ్ శనివారం కేసు నమోదు చేశారు.

వన్యప్రాణుల వేట.. నేరం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను వేటాడటం నేరమని యానంబైలు రేంజర్ కవితామాధురి అవగాహన కల్పించారు. రెడ్డిగూడెం, ఒంటిగుడిసె గొత్తికోయ గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. పలువురి నివాసాల్లో బాణాలు, విల్లులు, విద్యుత్తు వైర్లు స్వాధీనం చేసుకున్నారు. చాతకొండ రేంజర్ కనకమ్మ, ఎఫ్ఎస్‌వోలు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి

టేకులపల్లి, న్యూస్‌టుడే: కోయగూడెం ఓసీ నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ల కార్మికులకు వేతనాలు పెంచాలని తెలంగాణ ప్రగతిశీల మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న డిమాండ్ చేశారు. డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ టేకులపల్లి బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఏరియా కార్యదర్శి జర్పుల సుందర్, బ్రాంచి కార్యదర్శి మదార్ పాల్గొన్నారు.

11న సీఎం కప్ టార్చ్ రిలే ప్రదర్శన

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 3వ తేదీన ప్రారంభమైన సీఎం కప్ టార్చ్‌రిలే ర్యాలీ గుండాల మండలంలోకి ఈ నెల 11న ప్రవేశిస్తుందని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతూ సెంట్రల్ పార్క్ నుంచి సింగరేణి స్టేడియం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

దసరా వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు పురపాలకం ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి క్రీడా మైదానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ జానీపాషలతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తామని డీవీ తెలిపారు. నాయకులు డానియేల్, సాంబమూర్తి, సదానందం, సూర్యం, శ్రీను, ఈశ్వర్, హరినాథ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



పాల్వంచ, న్యూస్‌టుడే: కేటీపీఎస్ విద్యుత్కేంద్రం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) రీజనల్ నూతన కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కేశబోయిన కోటేశ్వరరావు, మడిశెట్టి గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్ మలోత్ బిచ్చా, అదనపు కార్యదర్శిగా గణపతి నియమితులయ్యారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలని రిలే దీక్ష

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ధరణిని రద్దు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలని పాండురంగాపురం గ్రామస్థులు కలెక్టరేట్ ఎదురుగా రిలే నిరాహార దీక్షను శనివారం చేపట్టారు. భాజపా నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. షరతుల్లేకుండా రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, రైతుబంధు, ప్రమాద బీమా కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి రమేష్, బాబురావు, ఉపేందర్, లాలు, వెంకటేష్, నగేశ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

థియేటర్‌పై దాడి.. ముగ్గురిపై కేసు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవర సినిమా ప్రదర్శన గంట ఆలస్యమైందన్న ఆగ్రహంతో గత నెల 27న పాల్వంచలోని ఓ థియేటర్‌లో అభిమానులు విధ్వంసానికి దిగారు. ప్రేక్షకులను రెచ్చగొట్టి సినిమా హాలు క్యాబిన్ అద్దాలు, ప్రొజెక్టర్, యూపీఎస్ సిస్టం, ఫర్నిచర్ ధ్వంసమయ్యేందుకు కారణమైన రవి, కృష్ణ, గోపిలపై థియేటర్ మేనేజర్ స్వామి శనివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై సుమన్ కేసు నమోదు చేశారు. రూ. 4 లక్షల నష్టం జరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆర్టీసీలో దసరా సందడి మొదలాయె

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

ఆర్టీసీలో దసరా సందడి కొనసాగుతోంది. తెలంగాణ సంప్రదాయ పండుగ బతుకమ్మ వేడుకల వేళ.. జిల్లా నుంచి తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. రద్దీని బట్టి పలు రూట్‌లలో ప్రత్యేక సర్వీసులను అధికారులు నడుపుతున్నారు. దసరా తర్వాత రెండ్రోజుల వరకు ఈ వెసులుబాటు కల్పించనున్నట్లు చెబుతున్నారు.

25 శాతం పెరిగిన రద్దీ..

కొత్తగూడెం నుంచి సాధారణ రోజుల్లో 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గత మూడు రోజుల్లో ఈ సంఖ్య 25 వేలకు చేరింది. డిపో నుంచి నిత్యం 60 సర్వీసులు హైదరాబాద్, కరీంనగర్, సూర్యాపేట, ఖమ్మం, ఇల్లెందు, మహబూబాబాద్ తదితర రూట్‌లలో నడుపుతున్నారు. రద్దీ నేపథ్యంలో అదనంగా మరికొన్ని సర్వీసులను కేటాయిస్తున్నారు. రోజువారీ ఆదాయం రూ.14 లక్షలకు అదనంగా మరో రూ.లక్ష వరకు రాబడి పెరిగిందని డిపో అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక సర్వీసులలో హైదరాబాద్ రూట్‌లో నాలుగు, ఇల్లెందు, ఖమ్మం రూట్‌లలో రద్దీని బట్టి ఆరు వరకు సర్వీసులను కేటాయిస్తున్నారు. వరంగల్, కరీంనగర్ రూట్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



కరీంనగర్ సర్వీసు వద్ద ప్రయాణికుల కిటకిట..

★ దసరా ఉత్సవాలను సొంత గ్రామాల్లో జరుపుకునేందుకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సులలో క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ కోరారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెంకటస్వామి రాజకీయ జీవితం.. ఆదర్శం



వెంకటస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఏఓ ఎం.రమాదేవి, అధికారులు..

కొత్తగూడెం కలెక్టరేట్, కొత్తగూడెం పట్టణం, పాల్వంచ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర మంత్రిగా గడ్డం వెంకటస్వామి అందించిన సేవలు ఆదర్శమని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ కొనియాడారు. వెంకటస్వామి జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఏఓ ఎం.రమాదేవి, ఎల్‌డీఎం రామిరెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి త్రినాథ్‌రావు పాల్గొన్నారు. ★ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ (ఫ్యామిలీ వెల్ఫేర్) డా.రవీందర్‌నాయక్ నివాళులర్పించారు. డీఎంహెచ్‌ఓ డా.ఎల్.భాస్కర్‌నాయక్, డీసీహెచ్ఎస్ డా.రవిబాబు పాల్గొన్నారు. ★ పాల్వంచ కేటీపీఎస్, మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వెంకటస్వామి జయంతి వేడుకల్లో పుర కమిషనర్ ఢాకునాయక్, కేటీపీఎస్ సీఈ మేక ప్రభాకర్‌రావు, అధికారులు పాల్గొన్నారు. ★ సింగరేణి కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాలో జీఎంలు, సూర్యనారాయణరాజు, ఎ.మనోహర్, వీసం కృష్ణయ్య, సంఘాల నాయకులు.. కొత్తగూడెం ఏరియాలో జీఎం షాలేము రాజు తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు.

★ **జూలూరుపాడులో..** వెంకటస్వామి చిత్రపటానికి తహసీల్దార్ స్వాతిబిందు నివాళులర్పించారు. మంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు.

జడ్జితో కలిసి మొక్క నాటిన చిన్నారి

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న కొత్తగూడెంకు చెందిన బాలుడు విశ్వామిత్ర చౌహాన్‌తో కలిసి కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు రామారావు, భానుమతి శనివారం మొక్కలు నాటారు. కోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రమేశ్, న్యాయవాదులు అనుబ్రోలు రాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.



రేపు 'ఆర్టిజన్' మహాసభ

పాల్వంచ: ఆర్టిజన్ల డిమాండ్ల సాధనకు కేటీపీఎస్ 'ఏ' కాలనీ వాలీబాల్ మైదానంలో ఈ నెల 7న మహాసభ నిర్వహిస్తున్నట్లు జేఏసీ ఛైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. ఐదు, ఆరు, ఏడు దశల సీఈలు మేక ప్రభాకర్‌రావు, పాలకుర్తి వెంకటేశ్వరరావులకు నాయకులు వినతిపత్రాల్ని అందజేశారు. ఆర్టిజన్ల కన్వర్షన్ ధ్యేయంగా సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ విశ్వేశ్వరరావు, కన్వీనర్ వజీర్‌లు హాజరవుతారన్నారు. తోట త్రినాథ్, రమేశ్, రజనీకుమార్, శారద, సాయికిరణ్, వీరస్వామి పాల్గొన్నారు.

సృజనశీలురు

చిట్టి బుర్రలకు కాస్త సాన పెడితే చాలు.. ఎన్నో కొత్త ఆలోచనలు వస్తాయి. 'స్వచ్ఛతా హీ సేవ', 'ఎకో బ్రిక్స్' అవగాహన కార్యక్రమాల్లో భాగంగా కొత్తగూడెం పురపాలకం అధికారులు ఇటీవల 'వావ్' ఈశ్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'వ్యర్థాల నుంచి కళాత్మకత' (వేస్ట్ టూ ఆర్ట్ క్రియేషన్) పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్, కాగితం, థర్మాకోల్ షీట్ వంటి వ్యర్థాలతో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమలో దాగిఉన్న కళ, సృజనాత్మక ఆలోచనలకు దర్పణం పట్టేలా వివిధ ఆకృతులు రూపొందించారు.



తయారు చేసిన వస్తువులతో కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థినులు

వాటర్ ప్రూఫ్ హ్యాట్, లైవ్ జాకెట్స్, ఇండియా గేట్, ఓడ, మామిడి కాయలు కోసే సాధనం, గృహాలంకరణ వస్తువులను తీర్చిదిద్ది ఔరా అనిపించుకున్నారు. ఆలోచనల్లో వైవిధ్యంతో అధికారులను కట్టిపడేశారు. విద్యతో పాటు విజ్ఞానాన్ని ఆపాదించుకుంటే అద్భుతాలు ఆవిష్కరించవచ్చని నిరూపించారు.

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే



వాటర్‌ప్రూఫ్ క్యాప్, లైవ్ జాకెట్లతో బాబు క్యాంపు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు..



ఓడ నమూనాతో బాలికలు..